# రెండు ప్రేమలు

కొప్పూరి పుష్పాదేవి

లక్ష్మికి ఒళ్లు తెలియని జ్వరం. భరించలేనంత ఒళ్లు నొప్పులు. మంచం మీద అటు నుంచి ఇటు కూడా తిరగలేకపోతోంది. అప్పుడు కూడా ఆమె మీద పడి, చంటిది రొమ్ము చీకుతోంది. అయినా, గొంతు తడవక, కడుపు నిండక అది ఏడుపుతో ఇంటి కప్పును లేపేస్తోంది. పొయ్యి మూల ఖాళీ గిన్నెలు చూసి, నాలుగేళ్ల చిట్టిగాడు ఆ గిన్నెలు విసిరి కొడుతూ చెల్లిని మించిపోతున్నాడు. ఆ చిన్న పూరి గుడిసెలో ఇంత రణరంగంగా ఉన్నా, లక్ష్మి మాత్రం ఏదో లోకంలో ఉన్నది. ఈ గోలంతా విని, పక్క గుడిసె రాములమ్మ కళ్లు చిట్లించి చూస్తూ, తల వంచి లోపలకు వచ్చింది.

మంచం మీద శవంలా లక్ష్మి, ఆకలి పిశాచాల్లా పిల్లలు. ఆమెకి అర్థమైంది. ''లచ్చిమికి మళ్లీ జొరం వచ్చింది కామాలు... పనికెళ్లనేక తొంగుంటే ఈ పిల్ల రాచ్చసులు దాన్ని పీక్కతింటున్నారు...'' అనుకుని, తన గుడిసెలోకి వెళ్లి, పొద్దున సుజాతమ్మ ఇచ్చిన అన్నం, సాంబారు తెచ్చి పిల్లల ముందు పెట్టింది. వాళ్లు ఆవురావురుమంటూ చాన్నాళ్లకు పడ్డ చిరుజల్లు నామరూపాల్లేకుండా భూమిలో ఇంకిపోయినట్లు క్షణాల్లో గిన్నె ఖాళీ చేశారు. రాములమ్మ లక్ష్మి నుదుట చెయ్యి పెట్టి చూసింది. కొలిమిలోని ఇనుప గుండులా కాలిపోతోంది. షాక్ కొట్టినట్లయ్యి, చెయ్యి ఇవతలికి తీసింది. బొడ్డు సంచి తడుముకుంది. నాలుగు రూపాయి బిళ్లలు తగిలాయి. మందుల షాపులో అడిగి జ్వరం బిళ్ల తీసుకుని టీస్టాల్లో టీ పోయించుకుని తెచ్చి, లక్ష్మిని లేపి కూర్చోపెట్టి, బిళ్ల వేసి, టీ తాగించింది. నిండు సూట్ కేస్ చూసిన రాజకీయనాయకుడిలా పిల్లలు అప్పటికి శాంతించి, ఆటల్లో పడ్డారు. టీ నీళ్లు కడుపులోకి వెళ్లడంతో లక్ష్మికి కూడా కొద్దిగా ప్రాణం వచ్చింది.



''కన్నతల్లిలా నన్ను ఆదుకుంటున్నావు. నీ ఋణం ఎలా తీర్చుకోను పిన్నీ...'' అంటూ ఆమె, రాములమ్మను పట్టుకుని బావురుమన్నది.

''అంత పెద్ద మాటలు ఎందుకు లేయే లచ్చిమీ. రాజు కనబట్టం లేదు. ఇంటికి రాటం నేదా...'' అడిగింది రాములమ్మ, పిల్లవాడు విసిరికొట్టిన గిన్నెలూ, చెంబులూ ఒక మూలకు సర్దుతూ.

''ఏం చెప్పమంటావు పిన్నీ... ఆడు ఇంటికొచ్చి వారమో, పది రోజులో అయింది. నేను లెక్క కూడా వేసుకోవటం లేదు. వస్తే ఎంత, రాకుంటే ఎంత...? వాడి తాగుడు, తిరుగుళ్లలో ఈ పెళ్లాం, పిల్లలూ గుర్తొస్తారా? వాడు రాకున్నా, ఏదో కూలి నాలి చేసుకుని నా పిల్లలను నేను దర్జాగా పోషించుకునే దాన్ని. ఈ ముదనష్టపు జ్వరం ఇలా నా వెంట పడుతోంది. పిల్లలకు నాలుగు మెతుకులు కూడా పెట్టలేకపోతున్నాను'' అంటుంటే ఏడుపుతో ఆమె గొంతు వణికింది.

''పోనీలేయే. జొరం సాయంత్రానికి తగ్గుతాయిలే. కూసేపు పడుకో. నీక్కూడా ఇంత ముద్ద పెడతాను, అన్నం వండి..'' అంటూ రాములమ్మ వెళ్లిపోయింది. ''పిన్ని కూడా లేకపోతే, నేనూ, నా పిల్లలూ ఏమయిపోయేవాళ్లమో. ఇలాంటి ధర్మాత్ములు ఇంకా కొంతమంది అయినా ఉండబట్టే. లోకం ఈ మాత్రం చల్లగా ఉంటోంది'' అనుకున్నది లక్ష్మి. ఆమెకు చిన్నప్పటి నుంచీ కష్టాలు తోడుగా వచ్చాయి.

తండ్రి రిక్షా తొక్కుతాడు. పచ్చి తాగుబోతు. నలుగురు పిల్లలు. తల్లే కూలి చేసి, అరకొరగా అయినా, పిల్లల కడుపులు నింపేది. లక్ష్మి తెల్లగా, సన్నగా కళ గల మొహంతో బంగారు తీగలా ఉండేది. తల్లితో పాటు శంకరం మాష్టారింటికి పాచి పనికి వెళ్లేది. ఆయన పిల్లలకు పాఠాలు చెప్తుంటే బొమ్మలా నిలబడి వినేది. ''అక్కడ చదువుకుంటున్న పిల్లలు ఎంత అదృష్టవంతులో... తనకా అదృష్టం లే''దని క్రుంగిపోయేది. చదువు మీద లక్ష్మి ఆసక్తిని గమనించిన శంకరం మాష్టారు, లక్ష్మికి పుస్తకాలు తనే కొనిపెట్టి, ఉచితంగా చదువు చెప్పడం మొదలుపెట్టారు. ఆమె సూక్ష్మగ్రాహి. చిటికెలో చదివేసి, మిగతా పిల్లల కన్నా ముందు ఉండేది. అలాగే సెవంత్ క్లాస్ పాసయింది మంచి మార్కులతో. ఇంతలో అనుకోని అవాంతరంలా శంకరం మాష్టారికి బదిలీ వచ్చింది.

''లక్ష్మిని నాతో పంపించు. మా ఇంట్లో పని చేసుకుంటూ, చదువుకుంటుంది. రెండేళ్లలో టెంత్ పూర్తవుతుంది. తర్వాత నీకూతురిని పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాను...'' అని బతిమలాడారు శంకరం మాష్టారు, లక్ష్మి తల్లిని.

సరిగ్గా అప్పుడే లక్ష్మి మేనత్త, లక్ష్మిని తన కొడుకు రాజుకు చేసుకుంటానని అడిగింది. ''కట్నం వద్దు, పెళ్లి ఖర్చు కూడా నేనే పెట్టుకుంటాను'' అన్నది.

గొప్ప అదృష్టం. మొగుడు చూస్తే తాగుబోతు. పిల్లలకు పెళ్లి చెయ్య

టం కాదు, కూడే పెట్టనివాడు. పిల్ల చిన్నదే అయినా, ఆడబడుచు చేసుకుంటానని అన్న ప్పుడు, తాను కాదంటే వాళ్లకు కోపం వస్తుంది. రెండేళ్ల తరువాత చేద్దామంటే వాళ్లు ఒప్పుకోకపోవచ్చు. వాళ్లూ తమలాగే కూలి చేసుకుని బ్రతికేవాళ్లే అయినా, ఈ మాత్రం మంచి అవకాశం తరువాత రాకపో వచ్చు... అని ఆలోచించిన లక్ష్మి తల్లి, పెళ్లికి ఒప్పుకున్నది.

మాష్టారు లక్ష్మిని ఒంటరిగా పిలిచి చెప్పారు. "నువ్వు ఈ పెళ్లికి ఒప్పుకోకు. ముందు ముందు నువ్వు కూడా మీ అమ్మ లాగే తిప్పలు పడతావు. మాతో పాటు వచ్చి ప్రైవేటుగా చదువుకో నీ జీవితం బాగుపడుతుంది" అని. తరువాత లక్ష్మి తల్లిని కూడా పిలిచి చెప్పి చూశారు. " అంత చిన్న పిల్లకు పెళ్లి చెయ్యడం నేరం. చేతులారా నువ్వే నీ కూతురి బ్రతుకుని బుగ్గి చెయ్యకు" అని.

"అదేమిటి బాబూ అలాగంటారు? నాకు అంత కన్నా చిన్న వయసులోనే పెళ్లి అయింది తెలుసా. మేమూ, దాన్ని పోషించలేము. పెళ్లీ చెయ్యలేము. మేనత్త కాడికే గదా పంపుతున్నాను. దాని మనసు పాడు చెయ్యమాకండి" అంటూ ఎదురు మాష్టారినే నిష్ఠుర మాడింది.

"మాష్టారి భార్యకు లేని జబ్బు లేదు. మంచం దిగలేదు. నువ్వయితే ఆమెకు బాగా చాకిరి చేస్తావని, నిన్ను తమతో తీసు కువెళ్లామని, చదువు వంకతో ప్లాన్ వేశాడు మాష్టారు" అంటూ లక్ష్మి మనసు విరి చింది, ఆమె తల్లి.


చదువు మీద శ్రద్ధ ఉన్న ఒక బీదపిల్లకు సాయం చేద్దామన్న మాష్టారి మంచి ఆలో చన అలా వ్యర్థమైపోయింది. తల్లి అలా చెప్పినా, లక్ష్మికి, మాష్టారి మీద నమ్మకమే. అయినా, చిన్నతనం. అమ్మని ఎదిరించి చదువుకున్నా ఆశాజనకంగా తోచని భవి ష్యత్తు. పెళ్లి పేరుతో ఇప్పుడు సమకూరే కొత్త బట్టలు, మొదలైన వాటిపై వ్యామో హంతో పెళ్లి, సంసారం, దాంపత్య బంధం, తరువాత మీద పడే అలవిమాలిన బాధ్య తలు-వేటిపైనా ఏమీ అవగాహన లేని లక్ష్మి, సంబరంగా పెళ్లి కూతురయింది.

పెళ్లి అయి ఆరు నెలలు. మూడు నెలల గర్భం. పెళ్లాం మోజు తీరిపోయిన లక్ష్మి మొగుడు రాజు, మామగారి బాట పట్టాడు. అతన్ని కూడా మించిపోతున్నాడు. చేసేది తాపీ పని. రెండు రోజులు పనికి వెళ్తే, నాలుగు రోజులు శలవులో ఉంటాడు. లక్ష్మికి తన తల్లి పాత్ర ధరించక తప్పలేదు.

"అమ్మ పడుతున్న కష్టాలు చూసి కూడా, అప్పుడు తనకు జ్ఞానోదయం కలుగ లేదు. నాకేదో మేలు చేద్దామనుకుని, అమ్మ అజ్ఞానంతో నన్నీ నరకకూపంలోకి తోసింది. ఈ తాగుబోతు మొగుడితో జీవితాంతం ఇక్కట్లు తప్పవు. అప్పుడు మాష్టారు

**(సింగరాజు రామచంద్రమూర్తి స్మారక కథల పోటీల్లో బహుమతి పొందిన కథ)**

ఎంతగా చెప్పారు, అప్పుడే పెళ్లి వద్దు. బాగా చదువుకుని, నీ కాళ్ల మీద నువ్వు నిల బడితే, జీవితంలో కష్టాలు వచ్చినా, తుఫాను వచ్చినా, నడిసముద్రంలో చెక్క ప లక ఆధారం లభించినట్లు ఉంటుంది.. అని. తాను విన్నదా? ఎవరు చేసిన కర్మ వారే



అనుభ

విస్తారని మన పెద్దలు ఊరికే చెప్పలేదు" అనుకున్నది లక్ష్మి నిట్టూరుస్తూ.

చిరకాలానికి వచ్చిన చుట్టంలా రాజు. ఆ రోజు ఇంటికి వచ్చాడు. షరా మామూ లుగా లక్ష్మిని తాగడానికి డబ్బులివ్వమన టం, "పెళ్లాం పిల్లలకు కూడు కూడా పెట్టవు. ఇంకా నీకు ఎదురు డబ్బు లివ్వాలా?" అని లక్ష్మి ఎదురు తిరగటం, ఇద్దరి మధ్యా గొడవ పెరిగి, ఆమెని గొడ్డుని బాదినట్లు బాదటం, వెంట వెంటనే జరిగిపోయాయి. లక్ష్మిని బూతులు తిడుతూ రాజు బయటకు వెళ్లిపోయాడు. లక్ష్మి ఏడుస్తూ, తిట్టుకుంటూ కూలబడింది.

సంగతేమిటో అని కంగారు పడుతూ వచ్చింది రాములమ్మ.

"ఎందుకు పిన్నీ ఈ పాడు బ్రతుకు! ఇంత విషం తెచ్చి, ఆ పిల్లలకు పెట్టి, నేనూ తింటే ఈ కష్టాలు కడతేరి పోతాయి" గుండెలు పగిలేలా ఏడుస్తోంది లక్ష్మి.

"ఊరుకోయే లచ్చిమీ. ఈ కష్టాలు మనకు కొత్తవా ఏంటే. అవి మనకు పాత చుట్టాలే గద. మనతో పాటు, ఇంకా చెప్పాలంటే మన కంటే ముందే పుడతాయి మనకోసం. మన కుటుంబాల్లో మొగోళ్లు చాలామంది తాగుబోతులే గదే. ఆడోళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని, సంసారాలు ఈదవదవలసిందేనే. నీకు తెలీంది ఏముంది. మీ తాత, మీ నాన్న, బాబాయిలు, మామలు ఎవరు తాగు బోతు కాదో చెప్పు. కొంచెం తక్కువో, ఎక్కువో. అంతే. మీ అమ్మమ్మ, నానమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మలు, ఇప్పుడు నువ్వూ. రేపు నీకూతురూ అందరం ధనవంతుల ఇళ్లల్లో పాచిపనులో, మరోటో చేసుకుని, వాళ్ల దయాదాక్షిణ్యాల మీద బతకవలసిన వాళ్లమే గందా. ఊరుకోయే లచ్చిమీ ఊరుకో. మన బాధలు అర్చేవాళ్లూ, తీర్చేవాళ్లూ ఎవరూ లేరే!" అంటూ పనికి టైము అవుతున్నదని రాములమ్మ కంగారుగా వెళ్లిపోయింది.

"ఔను. పిన్ని చెప్పింది అక్షరాలా నిజం. తాతల కాలం నుంచీ తమ సంసారాలు ఇట్లాగే అఘోరిస్తున్నాయి. తన అమ్మమ్మ, నాయనమ్మల ఇక్కట్లు తను చూడలేదా? లేచింది మొదలు, చాకిరీ.. చాకిరీ. తొలికోడి కూయక ముందే లేచి, ఇంటి పనంతా ఆదరాబాదరాగా చేసుకుని. పనికి పోయి, అక్కడ రెక్కలు ముక్కలు చేసుకుంటే, దొరికేవి చాలీచా లని కూలి డబ్బులే. అవే మహా ప్రసాదమ నుకుని, సరుకులు కొనబోతే ఉప్పు వస్తే పప్పు రాదు, పప్పు వస్తే ఉప్పురాదు. ఈ దేశంలో పాలకుల స్వార్థమో, ప్రజల మూర్ఖ త్వమో, ధనవంతులు ఇంకా ఇంకా ధనవం తులవుతున్నారు. బీదవారు మరీ మరీ పేదల వుతున్నారు. ఇక్కడ ఆహారపదార్థాలకు కొరత ఉంటుందేమో కానీ, మత్తు పదార్థాలకు అసలు కరవు ఉండదు. ఈ పనికిమాలిన పరి స్థితుల మీద తిరగబడాలి. తిరుగుబాటు చెయ్యాలి. తరతరాల హీనచరిత్రను తాను తిరగరాయాలి. శ్రీశ్రీ గారన్నట్లు ఎవరో వచ్చి, ఏదో చేస్తారని ఆశించకూడదు. మా క ర్మమింతే అని చేతులు ముడుచుకు కూర్చుంటే, తాము ఈ జన్మకు బాగుపడము.

ఇప్పుడు కూడా శంకరం మాష్టారు లాంటి మంచి మనుష్యులు ఉండకపోరు. వారి సాయంతో ఎంత కష్టపడి అయినా సరే. కూతురిని మంచి చదువు చదివించాలి. తన లాగా నలుగురి మీద ఆధారపడ్డ బ్రతు కు కాక, నలుగురికి ఆధారమయ్యే జీవితం ఇవ్వాలి. తన కొడుకు దుర్వ్యసనాల పాలైతే పోని సత్పురుషుడు కావాలి. మనిషి తల చుకుంటే సాధ్యం కానిది లేదట. తాను ఎలాగైనా ఈ రెండు పనులు సాధిం చాలి...అని కృతనిశ్చయం చేసుకున్నది లక్ష్మి.

అప్పటి వరకు ఆమెని పీడించిన బాధ తమాషాగా జారిపోయింది.

●